వరంగల్ వార్త
వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు
శుక్రవారం 1, డిసెంబర్ 2023
8 పేజీలు

మహిళా పోలింగ్ కేంద్రాన్ని...
సందర్శించిన కలెక్టర్

గోల్డెన్ ఓక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్ర సందర్శన

8లో...

ప్రభాతవార్త ప్రతినిధి,వరంగల్

వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పూర్తిగా మహిళలచే నిర్వ హించబడి ప్రత్యేకంగా కొత్తవాడలోని గోల్డెన్ ఓక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన

- ఈవిఎంలలో భవితవ్యం
- డిసెంబర్ 3వ తేది వరకు ఉత్కంఠ.. కొనసాగనున్న బెట్టింగ్‌లు
- గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు

2లో..

పరకాల- ప్రభాతవార్త

పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవిఎంలలో నిక్షిప్తమై ఉంది. గెలుపు ఎవరన్నది తేలాలంటే డిసెంబర్ 3



ముగిసిన... పోలింగ్....

ఎనుమాముల మార్కెట్‌కు చేరిన ఈవీఎంలు కౌంటింగ్ మిషన్లు

పరకాల- ప్రభాతవార్త

పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవిఎంలలో నిక్షిప్తమై ఉంది. గెలుపు ఎవరన్నది తేలాలంటే డిసెంబర్ 3 వరకు వేచి చూడాల్సిందే. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 7 మండలాల్లో పోలింగ్ జరిగింది. ఎన్నికలు ముగిసిన వెంటనే నియోజకవర్గానికి సంబంధించిన ఈవిఎంలు, వీవీప్యాట్‌లను వరంగల్ ఎనుమాముల మార్కెట్ కౌంటింగ్ కేంద్రానికి తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అభ్యర్థుల నామినేషన్లు, ఉపసంహరణ అనంతరం ప్రచారం జోరుగా కొనసాగాయి. గ్రీన్‌ఫీల్డ్ హైవేను మారాచలని డిమాండ్ చేస్తూ ఈ సారి పరకాల అసెంబ్లీ ఎన్నికల్లో భారీ సంఖ్యలో రైతులు నామినేషన్లు వేశారు. దీంతో 28మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అయితే ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్నికల సంఘం రెండు ఈవీఎంలను వినియోగించి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు ఎనుమాముల మార్కెట్ కౌంటింగ్ కేంద్రానికి చేర్చారు. డిసెంబర్ 3న కౌంటింగ్ జరగనుంది. అప్పటి వరకు అభ్యర్థుల భవితవ్యం ఈవిఎంలలోనే దాగి ఉండనుంది. ఫలితాలు వెలువడేందుకు ఇంకా రెండు రోజుల సమయం ఉండటంతో ఎవరు గెలుస్తారనే విషయంపై జోరుగా బెట్టింగ్‌లు కొనసాగనున్నాయి. ఆయా బూత్‌ల వారిగా పోలింగ్ శాతం తమకు అనుకూలమైన ఓట్లు ఎన్ని పడ్డాయని అభ్యర్థులు, తమ

- బిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- ఎగ్సిట్స్ పోల్స్ అన్ని హస్తం వైపే

వివరాలు 2 లో..

ఓరుగల్లులో హోరా హోరి

ప్రభాతవార్తప్రతినిధి- హన్మకొండ:

చారిత్రాత్మకమైన రాజకీయ చైతన్యం కలిగిన ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య హోరాహోరి పోరు జరిగినట్లు తెలుస్తోంది. 12 నియోజకవర్గాల్లో ఉదయం నుండి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి వృద్దులు, వికలాంగులు, యువత ఆసక్తి కనబర్చిన ప్పటికి జిల్లాలోని 10 నియోజక వర్గాల్లో ఓటింగ్ శాతం కొంత మెరుగైనప్పటికి ఓరుగల్లు నగరంలోని పశ్చిమ తూర్పులో ఓటింగ్ సరళి అతి తక్కువగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల రణరంగంలో నువ్వా నేనా అనే విధంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు తలపడినప్పటికి పది నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బిజెపి మధ్యనే గట్టి పోటి నెలకొంది. వరంగల్ తూర్పు పరకాల నియోజవర్గాల్లో మాత్రం బిజెపి కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య త్రిముఖ పోటి నెలకొన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా ఎగ్జిట్ పోల్ సంస్థలు ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలో ఓటర్లు హస్తం వైపే ముగ్గుచూపారని ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసిన ఫలితాలు తెలుపుతున్నాయి. గతంలో మాదిరిగా ఎక్కువ మెజార్టీతో గెలిచే స్థానాలు చెప్పలేకుండా ఉంది. ఓటరు నాడి కొంత సర్వే సంస్థలకు సైతం అందుకోక పోవడం గమనార్హం. ఈ 12 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ద ఏ పార్టీ గెలిచినా ఐదు నుండి పదివేల లోపే అతి స్వల్ప మెజార్టీతో ఎవ్వరు గెలుపొందుతారనే చర్చ జిల్లాలో బలంగా వినిపిస్తుంది. ఓటరును ఆకట్టుకోవడానికి ఒక వెయ్యి నుంచి మూడు వేల వరకు డబ్బు మద్యం పంపిణి చేసినప్పటికి మాత్రం ఓటర్లు మాత్రం అధికార పార్టీకి షాకిచ్చినట్లు తెలుస్తోంది. కాగా కాంగ్రెస్ అభ్యర్థులు ఓటుకు 500 రూపాయలు పంచినప్పటికి కొన్ని నియోజకవర్గాల్లో పంచనప్పటికి కాంగ్రెస్‌కే మొగ్గుచూపారనే చర్చ జరుగుతుంది. కాగా ఏదేమైనప్పటికి ఉద్యమ కిల్లాగా పేరుపొందిన ఓరుగల్లు జిల్లా తెలంగాణ ఉద్యమానికి గులాభి అధినేత వెన్నంటే ఉన్న విషయం

ఇరుపార్టీల నేతల మధ్య గొడవలు
పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సంఘటన

జనగామలో.. ఉద్రిక్తత

వివరాలు 2 లో..

జనగామ, ప్రభాతవార్త :

జనగామలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 244పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురువారం పోలింగ్ ప్రారంభమయ్యాక

ఆశ్రమ స్కూళ్లలో అభివృద్ధి...
లేనట్లేనా...?

2 పేజీలో...

- శిథిలావస్థకు చేరిన ప్రహరీ గోడలు, సూచిక బోర్డులు
- పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్న ఐటిడిఏ అధికారులు
- గిరిజనుల అభివృద్ధి వెనుకబడిన చందంగా మారే...
- నిధుల లేమినే కారణమని అధికారుల వెల్లడి

మేడారం, ప్రభాతవార్త :

గిరిజన పిల్లలను విద్యాపరంగా అభివృద్ధి కోసం నెలకొల్పిన ఆశ్రమ స్కూల్‌లలో అభివృద్ధి లేనట్లేనా అనేది ప్రశ్నార్ధకరంగా మారిందంటున్నారు. ఈ ఏడాదిలోనే ఈ విధంగా మారుటకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

ముగిసిన పోలింగ్

మొదటి పేజీ తరువాయి

అనుచరులు లెక్కలు వేసు కుంటు న్నారు. ఈ ఎన్నికల్లో బిజెపికి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏదేమైనా వచ్చే నెల డిసెంబర్ 3న విజేత ఎవరో తేలిపోనుంది.

ఓరుగల్లులో హోరాహోరి...

మొదటి పేజీ తరువాయి

కదుతారని గులాభి అభ్యర్థులు కేసిఆర్ భావించినప్పటికి ఓటర్లు మాత్రం అధికార పార్టీకి షాకివ్వబోతున్నట్లు సర్వేల ఆధారంగా తెలుస్తోంది. ఈవీఎంలో భద్రమైన ఓట్లు డిసెంబర్ 3న కౌంటింగ్ ఉండటంతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఎవరు ఓడుతారో ఎవరు గెలుస్తారో వేచి చూడాల్సి ఉంది.

జిల్లాలో కొనసాగుతున్న పోలింగ్...

సాయంత్రం ఐదు గంటల వరకు 62.46 నమోదు...

తెలంగాణరాష్ట్ర శాసన సభకు గురువారం జరిగిన ఎన్నికలలో హనుమకొండ జిల్లా పరిధిలో ఉదయం ఏడు గంటలకే ఓటింగ్ ప్రారంభమైంది. ఇందులో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత వాసులు ఉదయాన్నే ఓటు వేసి వ్యవసాయ పనులకు పోవచ్చు అని ఆలోచనతో గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఓటు వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటల వరకు వరంగల్ పశ్చిమ ఏడు శాతం, పరకాల 6.74 శాతం ఉదయం 9గంటల నుండి 11 గంటల వరకు 21.16 శాతం నమోదు అయింది. ఇందులో పరకాల 26.25, వరంగల్ వెస్ట్ 17.23 నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు ఓటింగ్

సరళిని పరిశీలిస్తే మొత్తం 35.29 శాతం. ఇందులో పరకాల నియోజకవర్గంలో 41.56 శాతం, హనుమకొండ(వరంగల్ పశ్చిమ) 30.44 శాతం నమోదైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం 5గంటల వరకు 62.46 శాతం పోలింగ్ అయినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో పరకాల నియోజకవర్గం 76.85 శాతం, వరంగల్ వెస్ట్ నియోజకవర్గం 51.34 నమోదైంది. పోలింగ్ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటలతో ముగియనుండగా, జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు పోలింగ్ కేంద్రాలలో ఇప్పటికీ పలువురు తమ ఓటు వినియోగించు కునేందుకు బారులు తీరి ఉన్నారు. అక్కడక్కడ ఈవిఎంలో కొంత మొరాయించగా అధికారుల చొరవతో సర్దు మనిగాయి. ఏదేమైనా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసాయి.

జనగామలో ఉద్రిక్తత..

మొదటి పేజీ తరువాయి

పోలింగ్ సరళిని పరిశీలించేందుకు పోలింగ్కేంద్రం లోకి బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి రావడంతో అదేసమయంలో ఆయన వెంట మరి కొంతమంది పార్టీ కార్యకర్తలు పల్లాను అనుసరించి పోలింగ్‌బూత్ వద్దకు వెళ్లి బయట వేచి ఉండగా, పల్లా ఈవీఎంలను పరిశీలిస్తున్న సందర్భంలో కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి మరికొందరు పోలింగ్ పోలింగ్‌బూత్ వద్దకు ఎందుకు వచ్చారని ప్రశ్నించడంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్త మీకేం ఇబ్బందని అనడంతో అక్కడే ఉన్న సీపీఎం నాయకులు బూడిదగోపి, బీజేపీ పార్టీ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డితో సహా మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి దిగగా ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. వెంటనే జనగామ సీఐ శ్రీనివాస్‌యాదవ్, టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ తదితర సిబ్బంది అక్కడున్న వారిని చెదరగొట్టి బీఆర్ఎస్ కార్యకర్త కృష్ణను సీఐ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటన స్థలానికి డీసీపీ సీతారాం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అదేవిధంగా జనగామ వ్యవసాయ మార్కెట్ సమీపంలోని మరో పోలింగ్‌బూత్‌లో కూడా అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు గొడవలకు దిగడంతో పోలీసులు రంగంలోకి దిగి సద్దుమ ణిగించారు. అలాగే జనగామ మండలం శామీర్‌పేట, ఓబుల్‌కేశ్వాపూర్‌లో సైతం బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నాయకులతో పోలింగ్‌స్టేషన్ వద్ద ఆందోళనతో కూడిన గొడవలు జరగడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని లాఠీచార్జి చేసి ఇరువురికి నచ్చచెప్పి పంపించివేశారు. చెదురుమదురు సంఘటనలు మినహా జనగామ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆశ్రమ స్కూళ్లలో అభివృద్ధి లేనట్లేనా ..?

మొదటి పేజీ తరువాయి

ఆరోపణలు వస్తున్నాయి. ఏజెన్సీలోని 9 మండలాల్లో పనిచేస్తున్న గిరిజన ఆశ్రమ స్కూల్లు అధ్వానంగా మారడం జరిగింది. దీంతో గిరిజన విద్యార్థులు అభివృద్ధి మరో విధంగా పదేండ్లు వెనుక బడి పోయినట్లేనని అంటున్నారు. ఆశ్రమ స్కూల్ చుట్టూ రక్షణ కవచంగా నిర్మించిన ప్రహారీ గోడలు శిథిలావస్థలో ఉన్నాయి. గట్టిగా వర్షాలు కురిస్తే కూలి విధంగా మారాయి. అంతేకాకుండా పాఠశాల గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు కల తప్పి కనిపిస్తున్నాయి.

-పట్టింపులేనట్లుగా ఐటిడిఏ అధికారులు

ఆశ్రమ స్కూల్ అభివృద్ధిని పట్టించుకునే ఐటిడిఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నో ఏండ్ల కిందట నిర్మించిన ప్రహారీ గోడలు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను పట్టించుకునే నాదుడే లేడనే విధంగా నెలకొంది. ఆశ్రమ స్కూళ్లను సందర్శించి తనిఖీ చేయాల్సిన అధికారులు కూడా ఇప్పటి వరకు సందర్శించలేదు. హై

స్కూల్ ఏ విధంగా నడుస్తున్నాయి. ఇంకా ప్రగతికి ఎలాంటి సూచనలు ఇవ్వాలనేది లేకుండా పోయింది. తాడ్వాయి, కొడిశెల, కాటాపురం, హాస్టల్, కాల్వపల్లి, ఆశ్రమ స్కూల్, బయ్యక్కపేట స్కూల్ ప్రహారీ గోడలు కూలిపోయే విధంగా ఉన్నాయి.

-ఇకనైనా దృష్టి పెడితేనే బాగుంటుంది

ఆశ్రమ స్కూల్ల అభివృద్ధిని ఐటిడిఏ అధికారులు ఇకనైనా దృష్టి పెడితేనే బాగుంటుందని అంటున్నారు. స్కూల్ల పనితనాన్ని ఏడాది కాలంగా ఏ విధంగా ఉందో చూసిన దాఖలాలు లేవంటున్నారు. ఆశ్రమ స్కూల్ అభివృద్ధిని పట్టించుకో కపోవడంతో అన్ని విధాలుగా వెనుక బడి పోయాయి. గిరిజన అభివృద్ధి కోసం నెలకొల్పిన ఐటిడిఏ విద్యా బోధన, విద్యార్థులకు సమకూర్చిన పౌష్టికా హారం, స్కూల్ చుట్టూ రక్షణ కవచంగా నిర్మించిన ప్రహరీ గోడలు వాటి విషయాన్ని మర్చిపోయారని పలు గిరిజన ప్రజాప్రతినిధులు ఆరోపిస్తు న్నారు. ఏడాది కాలంగా పట్టించుకో కపోవ డంతో అభివృద్ధి ఫలాలు పదేండ్ల కాలం పాటు వెనుక బడిన చందంగా ఉన్నాయ ంటున్నారు.

పోలింగ్‌కేంద్రాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు

మహబూబాబాద్,నవంబర్30,ప్రభాతవార్త

అసెంబ్లీ పోలింగ్ నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి అంబరీష ఆదేశాల ప్రకారం గురువారం ఆయాపోలింగ్ కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మెడికల్ క్యాంపులో ఫస్ట్‌ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయడం జరిగిందని, మున్సి పాలిటి పరిధిలో ఇందిరాకాలనీ, కృష్ణకాలనీ, అంబేద్కర్‌నగర్ తదితర పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు లను పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతి మెడికల్ క్యాంపు లో ఆశావర్కర్, హెల్త్‌స్టాఫ్‌ను ఏర్పాటు చేయడంజరిగిందని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకున్న హన్మకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్

ప్రభాతవార్త- సుబేదారి:

హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఎన్నికల రిట ర్నింగ్ అధికారి, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తన ఓటు హక్కును విని యోగించుకున్నారు. ప్రతి ఒక్కరు విధిగా ఓటు హక్కును వినియో గించుకొని హనుమకొండలో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజా స్వామ్యాన్ని కాపాడి తమ హక్కులను ప్రశ్నించే విధంగా ఉండాలని తెలిపారు.

మండలంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

-మండల వ్యాప్తంగా 85% పోలింగ్

-పోలింగ్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ, ఎన్నికల అధికారులు

గణపురం, నవంబర్ 30, ప్రభాతవార్త

గణపురం మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండల వ్యాప్తంగా 15పోలింగ్ స్టేషన్‌లో 36బూతులను మండల వ్యాప్తం గా ఏర్పాటు చేశారు. గురు వారం జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలలో మండల వ్యాప్తంగా 31,909ఓటర్లు ఉండగా సాయంత్రం వరకు 27,237 మంది వారి ఓటు హక్కును వినియో గించుకున్నారు. మండల వ్యాప్తంగా సాయంత్రం నాలుగు గంటల వరకు 85% పోలింగ్‌తో ముగిసింది. పోలింగ్ సెంటర్ల వద్ద ఎలంఆటి అల్లర్లు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా, పోలింగ్ సెంటర్ జిల్లా ఎస్పీ ఎన్నికల నిఘాధికారులు ప్రత్యేక బృందాలుగా పరిశీలించి ఓటర్లకు ఇబ్బందులు కలవకుండా మెరుగైనా సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

ఓటు వేసిన ప్రజలకు విప్లవ జేజేలు

పాలకుర్తి, నవంబరు 30 ప్రభాతవార్త :

పాలకుర్తి నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థి రమేష్‌రాజా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటువేసిన ప్రజలకు విప్లవ జేజేలు తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఉదయం రమేష్‌రాజా తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం పాలకుర్తి, రాయపర్తి, పెద్దవంగర, తొర్రూరు, దేవరుప్పుల మండలాల్లోని పలు గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈసందర్భంగా రమేష్‌రాజా మాట్లాడుతూ ఎన్నికల్లో కులం, మతం ప్రాంతంతో డబ్బు, మద్యం ఓటర్లను ప్రభావితం చేశాయని, ఆధిపత్య సామాజిక శక్తుల మధ్య పోరాటం నడిచిందని, అవినీతి, దోపిడిశక్తులకు వ్యతిరేకంగా ప్రజలు గుణపాఠం చెప్పేలా పోలింగ్ జరిగిందన్నారు. ఆయనతోపాటు పార్టీ సీనియర్ నాయకులు జీడి సోమయ్య, అనంతోజు రజిత, దుస్సా శివప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన ఓటర్ల అంతిమ తీర్పు

- రాత్రివరకు కొనసాగిన పోలింగ్ - 5గంటలలోపు అత్యధికంగా జనగామలో 83.34శాతం పోలింగ్ - అత్యల్పంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో 76.25శాతం

- 270బూత్‌లో హైడ్రామా.. కాంగ్రెస్-బీఆర్ఎస్ కార్యకర్తల ఘర్షణ

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :
జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో చెదురుముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని పోలింగ్ బూత్‌లలో ఉదయం పోలింగ్ సరళి కొంత మందకొడిగా జరిగినా తిరిగి ఓటర్లు ఓటువేసేందుకు బారులు తీరారు. జనగామ, పాలకుర్తి నియోజకవర్గాలలో చెదురుముదురు సంఘటనలతో కొంత ఉద్రిక్తత నెలకొన్నా పోలీసులు జోక్యంచేసుకుని పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో రాత్రి వరకు కూడా పోలింగ్‌కొనసాగింది. సాయంత్రం 5గంటల లోపు జనగామలో అత్యధికంగా 83.34 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో 76.25శాతం నమోదు అయ్యింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాలు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ఉండగా, జనగామ నియోజకవర్గ పరిధిలో ఏడుమండలాలు, 191గ్రామాలు, 277పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 2,37,108మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,18,160, మహిళలు 1,18,939 మంది, 9మంది థర్డ్‌జండర్లు ఉన్నారు. జనగామ శాసనసభ ఎన్నికల్లో 19మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అదేవిధంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మొత్తం 9మండలాలు ఉండగా, 119గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 290పోలింగ్‌స్టేషన్లతో మొత్తం 2,42,981ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,20,848మంది, మహిళలు 1,22,132మంది ఉన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలో 19మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అదేవిధంగా పాలకుర్తి నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు ఉండగా, 178గ్రామాలు, 294పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం ఓటర్లు 2,3,730 ఉండగా, వీరిలో పురుషులు 1,22,040మంది ఉండగా, మహిళ ఓటర్లు 1,21,682మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 8మంది ఉన్నారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో 15మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం మూడు నియోజకవర్గాల పరిధిలో 53మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

- నియోజకవర్గాల వారీగా పోలింగ్‌శాతం వివరాలు..

ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోలింగ్ శాతం వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఉదయం 9గంటలలోపు జనగామలో పోలింగ్‌శాతం 10.84శాతం ఉండగా, స్టేషనఘన్‌పూర్‌లో 9శాతం పోలింగ్ నమోదుకాగా, పాలకుర్తిలో 9.4శాతం నమోదైంది. 11గంటలకు జనగామలో పోలింగ్ 24.53శాతం నమోదుకాగా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 23శాతం, పాలకుర్తిలో 22.28శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 1గంటలకు జనగామలో 43.74 శాతం పోలింగ్ నమోదు కాగా, స్టేషనఘన్‌పూర్‌లో 44.60శాతం, పాలకుర్తిలో 44.57శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మధ్యాహ్నం 3గంటలకు జనగామలో 62.23శాతం పోలింగ్ నమోదు కాగా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 62.40శాతం, పాలకుర్తిలో 62.10శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం 5గంటల లోపు జరిగిన పోలింగ్‌లో జనగామ నియోజకవర్గంలో 83.34శాతం పోలింగ్ నమోదు కాగా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 76.25 శాతం పోలింగ్ జరగగా, పాలకుర్తి నియోజక వర్గంలో 81.23శాతం పోలింగ్ నమోదు అయ్యింది. కాగా, రాత్రి వరకు కూడా ఆయా నియోజకవర్గాలలో పోలింగ్ కొనసాగింది.

- అంబేద్కర్‌నగర్‌లో బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ఘర్షణ:

జనగామ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లోని 270బూత్‌నంబర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఘర్షణ నెలకొనడంతో పోలీసులు లాఠీచార్జిచేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. 270 బూత్‌లో రాత్రి 8.15గంటల వరకు ఓటింగ్ జరిగింది. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తమ ఏజెంట్ పోలింగ్‌బాక్స్‌లు సీజ్ కాకముందే బయటకు వచ్చాడని పోలీసులకు చెప్పి లోనికి వెళ్లడంతో ఈవిషయం తెలుసుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు కార్యకర్తలు పోలింగ్‌బూత్‌కు చేరుకుని ప్రశాంతరెడ్డిని ఎందుకు అనుమతించారని, ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదంతోపాటు ఘర్షణ నెలకొంది. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డిని అక్కడినుంచి పంపించివేయడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రశాతంగా ముగిసిన పోలింగ్

ఏటూరునాగారం ప్రభాతవార్త నవంబర్ 30

మండల వ్యాప్తంగా 81.77 శాతం పోలింగ్

ఈవిఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం

ఏటూర్‌నాగారం,నవంబర్ 30,ప్రభాతవార్త:
ఏటూర్‌నాగారం మండల కేంద్రంలో గురువారం పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. ఈవిఎంలలో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమై ఉంది. ఎవరూ అంచనా వేయలేని రీతిలో 50, 50 గా ఓటింగ్ జరిగినట్లు చర్చించుకుంటున్నారు. ఉదయం 7. గంటల నుండి మందకోడిగా ప్రారంభైమన పోలింగ్ మధ్యాహ్నం తరువాత ఒకే సారి ఓటర్లు రావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఏటూర్‌నాగారం మండలంలో మొత్తం ఓటర్లు 23,155 మంది ఉండగా, అందులో పురుషులు 11281 మంది, మహిళలు 11869 మంది. జండర్స్ 5.మండల వ్యాప్తంగా 28 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగింది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి మండల వ్యాప్తంగా పోలిగ్ శాతం 81.77 శాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. పోలింగ్ సరళిని ములుగు జిల్లా ఎస్పీ గౌష్‌ఆలం, ఎమ్మెల్యే సీతక్క, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నర్సింహారావు (లక్ష్మణ్‌బాబు) సందర్శించి పరిశీలించారు. మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న యువత హర్షం వ్యక్తం చేశారు. వయో వృద్ధులను పోలీసులు వీల్ చైర్స్ సహాయంతో పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లి ఓట్లు వేసేందుకు సహకరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎవరికీ వారే గెలుపు మాదే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో బీజేపీ, బీఎస్పి ఉనికి నామమాత్రంగానే ఉందని చర్చించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

మండలంలో 87.87శాతం పోలింగ్

మంగపేట నవంబర్30, ప్రభాతవార్త
తెలంగాణాలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నియోజక వర్గంలో చెదురు మొదురు సంఘటనలు తప్ప మిగిలిందంతా ప్రశాంతంగా జరిగింది. మంగపేట మండలంలో సంస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో ఉదయం 7గంటల నుండే పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ముగిసింది 87.87శాతంగా పోలింగ్ శాతం నమోదయ్యిందని అధికారులు తెలిపారు. కమలాపురం ఒక బూత్‌లో ఒక మహిళ ఓటును మరొకరు వేశారు. అదే విదంగా గంపోనిగూడెంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు తమకు డబ్బులు ఇవ్వలేదని మంగపేటలోని ఓబీఆర్ఎస్ నాయకుడి ఇంటి వద్దకు వెళ్ళి ఆంధోళనకు దిగారు. కమలాపురంలో ఓబీఆర్ఎస్ నాయకుడిపై దాడిచేసినట్లు సమాచారం.
మంగపేట మండలంలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు గట్టిగానే చేతివాటం ప్రదర్శించారు. ఓటర్లకు పంచాల్సిన డబ్బులు నాయకులే స్వాహా చేశారని, గ్రామంలో కొందరి డబ్బులు పంచి కొందరికి డబ్బులు పంచక పోవడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

చింతకాని, నవంబర్ 30 ప్రభాతవార్త :
మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గ్రామంలో అత్యధికంగా 94 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. అత్యంత ఉత్సహంతో రైతులు, మహిళలు,యువత తమ ఓటుహక్కును ఉపయోగించుకున్నారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో గ్రామ పెద్దలు, ప్రభుత్వ అధికారులు కీలక పాత్ర పోషించారు.

నేరాలు-దారుణాలు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ప్రభాతవార్త- సుబేదారి:

గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంకం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కార్డు డీకొట్టడంతో కారు, ద్విచక్ర వాహనాలు పల్టీలు కొట్టి రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పడ్డాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురు కుటుంబ సభ్యులతో పాటు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న నలుగురు కుటుంబ సభ్యులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరళించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుల పంపకంలో ఘర్షణ- కౌన్సిలర్ భర్తపై దాడి

నర్సంపేట, నవంబర్ 30, ప్రభాతవార్త
శాసన సభ ఎన్నకల్లో భాగంగా ఓట్లకు డబ్బులు పంపిణి విషయంలో విభేదాలు రావడంతో ఒకటో వార్డులో ఘర్షణ జరిగింది. ఒకటో వార్డు కౌన్సిలర్ భర్త దేవేజు సదానందం బిఆర్ఎస్ పార్టీ తరుపున డబ్బులు పంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నాడని అదే వార్డుకు చెందిన ఓ వ్యక్తి దాడి చేసి కొట్టిన సంఘటన బుదవారం రాత్రి జరిగింది. వార్డులో ఉన్న ఓటర్లకు డబ్బులు పంచేందుకు బాధ్యత తీసుకున్న దేవోజు సదానందం డబ్బులు పంచకుండా దాటేయడంతో అదేవార్డుకు చెందిన ఓ యువకుడితో పాటు మరికొంత మంది ఘర్షణకు దిగి కొట్టినట్లు తెలిసింది.

ఓటు హక్కు వినియోగించుకున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థి మల్లేష్

టేకుమట్ల నవంబర్ 30, ప్రభాతవార్త

భూపాలపల్లి నియోజకవర్గ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఎమ్మెల్యే అభ్యర్థి మారేపల్లి మల్లేష్ తన ఓటు హక్కును జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామాంలో బూతు నెంబర్ 170లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు కొనియాడుతున్న భారత రాజ్యాంగం చాలా మహోన్నతమైనదని అలాంటి దేశంలో ప్రజాస్వామ్యం బద్ధంగా ఓటు హక్కును వినియోగించి ప్రజా ప్రతినిధులు ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో తనకు ఓటు వేసిన ఓటరు మహాశయులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు అని ఆయన అన్నారు.

ఓటును వినియోగించుకున్న మధిర సిపిఎం అభ్యర్థి గార్లవాసి పాలడుగు భాస్కర్

గార్ల, నవంబర్30 ప్రభాతవార్త:
ఖమ్మంజిల్లా మధిర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా సిపిఎం పార్టీ తరుపున నిలబడిన సిఐటియు రాష్ట్రప్రధాన కార్యదర్శి, జాతీయకమిటి సభ్యులు, గార్లవాసి పాలడుగు భాస్కర్ గురువారం మండల కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లి ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో సిపిఎం పార్టితరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటుహక్కు గార్లలో ఉండగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్‌గూత్‌లో ఓటును వినియోగించుకున్నారు.

గూడూరులో ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

రాత్రి 8 గంటల వరకు కొనసాగిన పోలింగ్

84 శాతం పోలింగ్ నమోదు

గూడూరు, నవంబర్ 30, ప్రభాతవార్త

గూడూరు మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. కొన్ని గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగడంతో అక్కడ రాత్రి 8 గంటల వరకు ఓటింగ్ జరిగింది. మండలంలోని 39 గ్రామపంచాయతీల పరిధిలో 51 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగగా ఉదయం నుండి ఓటర్ల రద్దీ కొనసాగింది. దాదాపు చాలా వరకు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగిసే సమయానికే ఓటింగ్ ప్రక్రియ పూర్తి కాగా మండలంలోని మట్టెవాడ, అయోధ్యాపురం, పొనుగోడు, గుండెంగ గ్రామాల్లోని 7 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకు ఓటర్లు ఓపికగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగులు కూడా పలు చోట్ల నేరుగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 46591 మంది ఓటర్లకు గాను గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో 39487 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా 84శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలో జరిగిన పోలింగ్ ప్రక్రియను బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీల అభ్యర్థులతో పాటు బరిలో ఉన్న ఇతర అభ్యర్థులు కూడా పరిశీలించారు. అదేవిధంగా మంత్రి సత్యవతి రాథోడ్ కూడా మండలంలో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఏజెన్సీ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర సాయుధ బలగాల బందోబస్తు మధ్య పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువతీయువకులు తొలిసారిగా తమ ఓటు హక్కు వినియోగించు కునేందుకు ఉత్సాహంగా పోటీ పడ్డ దృశ్యాలు కనిపించాయి.

ప్రశాంతంగా పోలింగ్

-నియోజకవర్గంలో 76.85 శాతం

-పోలింగ్ కేంద్రాల్లో క్యూకట్టిన ఓటర్లు

-పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు

పరకాల- ప్రభాతవార్త:

పరకాల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. కొన్ని చోట్ల సమయం ముగిసిన తర్వాత కూడా ఓటర్లు బారులు తీరారు. సాయం దాటినప్పటికి ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్కడక్కడా ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఓటర్లు నిరీక్షించాల్సి న పరిస్థితులు ఎదురయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరకాల పట్టణంలో పాటు నడికూడ, ఆత్మకూరు, దామెర గీసుకొండ సంగెం, పరకాల మండలాల్లో ఆయా గ్రామాల్లో పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం పూట పోలింగ్ మందకొటిగా జరిగినప్పటికి మధ్యాహ్న సమయంలో ఓటింగ్ శాతం పెరిగింది. సాయంత్రం మళ్లీ పుంజుకుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు మంచినీరు, నీడ సౌకర్యం కల్పించారు.

బారులు తీరిన ఓటర్లు...

ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు పోలింగ్ మందకోటిగా సాగింది. మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు పుంజుకుంది. ఆ తర్వాత సాయంత్రం 4గంటలకు కొంత ఊపందుకుంది. కొంత మంది సాయంత్రం సమయంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణ ప్రాంతం కంటే గ్రామీణ ప్రాంతంలోనే అధిక శాతం ఓటు నమోదైనట్లు తెలుస్తోంది. గ్రామీణ

ప్రాంతాల్లో ఓటర్లు స్వచ్ఛందంగా కేంద్రాలకు చేరుకొని తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు బారులు తీరారు.

ఆకట్టుకున్న మోడల్ కేంద్రాలు....

పట్టణంలో మాదారం కాలనీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ఓటర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శుభకార్యాల్లో ఏర్పాటు చేసేలా స్వాగత తోరణాలు, గ్రీన్ కార్పెట్ వేసి ఓటర్లను సాధరంగా ఆహ్వానించారు. ప్రత్యేకంగా కుర్చీలు వేశారు. చిన్నపిల్లలు ఉన్న తల్లులు కోసం మదర్ ఫీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా ఓటర్లకు, చిన్న పిల్లలకు స్నాక్స్, బిస్కెట్లు తినుబండారాలను అందజేశారు. వీరు ఓటు వేసే సమయంలో అంగన్‌వాడీ ఆయాలు చిన్నారలను ఆడిపించారు. వికలాంగుల కోసం వీల్ చైర్లు ప్రత్యేకంగా ఇంటి నుంచి తీసుకురావడానికి వాహనాలను సమకూర్చారు.

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు...

పరకాల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించాయి. పరకాల మండలం, సీతారాంపురం గ్రామంలో గల పోలింగ్ కేంద్రంలో దాదాపు 45 నిమిషాలు ఈవీఎం పనిచేయలేదు. పట్టణంలోని 59వ బూత్‌లో కొంత సేపు మొరాయించింది. ఆ తర్వాత అధికారులు స్పందించి వాటిని సరిచేశారు. దీంతో పోలింగ్ సజావుగా సాగింది. మొరాయించిన ఈవీఎంలను సరిచేసేందుకు ప్రత్యేక బృందం ఆయా పోలింగ్ కేంద్రాలకు వంపిణీ ఇబ్బందులు లేకుండా చూశారు. సీతారాంపురం గ్రామంలో 7గంటలకు ఓటింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈవీఎంలు మొరాయించడంతో 7.45 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.

పోలీస్ నిఘా నీడలో...

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేక పోలీసు బలగాలను మొహరించాయి. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేవారు తప్పా పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దారిదాపుల్లో ఎవరికి అనుమతించలేదు.

గంటల వారిగా....

ఉదయం 7గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు 6.74 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11 గంటల వరకు 26.25 శాతం పోలింగ్ నమోదు కాగా ఒంటి గంట వరకు 41.56 శాతం నమోదు కాగా, మధ్యాహ్నం 3గంటల వరకు 58.23 శాతం పోలింగ్ నమోదు కాగా సాయంత్రం 5 గంటల వరకు 76.85 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

సాయంత్రం ఐదు గంటల వరకు 89.32 నమోదు

రాయపర్తి, నవంబర్ 30, ప్రభాతవార్త

మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నిలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువతీ యువకులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపించారు. ఫలితంగా సాయంత్రం ఐదు గంటలకు ఓటింగ్ ముగిసేసరికి మండల కేంద్రంలో 89.32 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రారంభించారు.

గంగారం మండలంలో 90శాతం పోలింగ్

గంగారం, నవంబర్ 30, ప్రభాతవార్త

మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని గంగారం మండలం లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగి ంది. మండలంలో 90శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ములుగు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఈ మండలంలోని 12 గ్రామపంచాయతీల పరిధిలో 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా పోలింగ్ ముగిసే సమయానికి 8820 మంది ఓటర్లకు గాను 7983 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇందులో అత్యధికంగా రామవరం, పందెం గ్రామాల్లో 96 శాతం ఓటింగ్ నమోదుకాగా అత్యల్పంగా కోమట్లగూడెంలో 86శాతం పోలింగ్ నమోదైంది అన్ని పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికే ఓటర్లు బారులు తీరారు. అయితే ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం విశేషం. మండలంలో 4387 మంది మహిళా ఓటర్లు ఉండగా అందులో 4024 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల విషయానికొస్తే 4432 మందికి గాను 3959 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొత్తానికి మండలంలో గురువారం నాటి పోలింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సందర్భంగా మండలంలో కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతంగా ముగిసిన శాసనసభ ఎన్నికలు

టేకుమట్ల నవంబర్ 30, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు మండల ఎన్నికల అధికారి తహశీల్దార్ మంజుల తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల సందర్భంగా మండలంలోని 24 గ్రామ పంచాయితీలలో 28 పోలింగ్ బూత్‌లలో మొత్తం ఓటర్లు 21715 ఉండగా తమ ఓటు హక్కును 19045 మంది సద్వినియోగం చేసుకున్నారు. మండలంలో మొత్తం పోలైన ఓటర్ల శాతం 87.70% శాతం పోలయిన్నాయి అని, మండలంలో ట్రాన్స్ జెండర్స్ లేరని మండల ఎన్నికల అధికారి తహశీల్దార్ మంజుల తెలిపారు. మండలానికి వచ్చిన ఎన్నికల నిర్వహణ సిబ్బంది ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా విధులు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది ద్వారా సేవలు అందించారు. మండల వ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ బూతులలో సాంకేతిక లోపం లేకుండా చూసుకోవాలని మండల ఎన్నికల అధికారి తహశీల్దార్ మంజుల ఆదేశాలు జారీ చేశారు.

అమీనాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి దొంతి

చెన్నారావుపేట, నవంబర్ 30, ప్రభాతవార్త

నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి తన ఓటు హక్కును మండలంలో గురువారం వినియోగించుకున్నారు. తన స్వగ్రామమైన మండలంలోని అమీనాబాద్ గ్రామానికి ఉదయమే చేరుకున్నారు. స్థానిక పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో దొంతి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.



- మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు....

మండలంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని 40 పోలింగ్ బూత్‌లు, 4 సెక్టార్లలో 40మంది పీవోలు, 40మంది ఏపీవోలు 80మంది ఏపీవోలతో పాటు పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు. ఉదయం 7గంటలకు మొదలైన ఓటింగ్ క్రమేణా మొదలై ఊపందుకుంది. గ్రామాలు, తండాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు భారులు తీరారు. సూర్యాపేటతండా, ఖాదర్‌పేట, ఉప్పరపల్లి,

పాపయ్యపేట, లింగగిరి, ఎల్లాయిగూడెం గ్రామాల్లో సాయంత్రం 5 తర్వాత కూడా ఓటింగ్ కొనసాగింది. పలు గ్రామాల్లో ఓటర్లు ఎంతో చైతన్యవంతంతో ఓటింగ్‌కు తరలివచ్చారు. పట్టణ ప్రాంతంలో ఉన్న ఓటర్లు గ్రామాలకు చేరుకున్నారు. ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశారు. నిత్యం బూత్‌లను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న పోలింగ్ కేంద్రం

- స్వాగత తోరణాలు, టెంట్లు ఏర్పాటు

- పరకాల మోడల్ పోలింగ్ కేంద్రం

పరకాల- ప్రభాతవార్త:

ఆ పోలింగ్ బూత్‌లో పండుగ వాతావరణంలో ఓటింగ్ జరిగింది. పరకాల పట్టణంలోని 36వ బూత్‌లో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను పచ్చటి కాకతీయ తోరణం, బెలూన్‌లతో కూడిన తోరణాలు స్వాగతం పలికాయి. పట్టణ పరిధిలోని మాదారం కాలనీలో ఎన్నడూ లేని విధంగా అందంగా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. స్వాగత ద్వారానికి ఇరువైపుల తోరణాలతో పాటు ఓటర్లకు అవగాహన కలిగేందుకు ఓటు హక్కు వినియోగంపై బ్యానర్లను ఏర్పాటు చేశారు. స్వాగత తోరణం దాటగానే ఓటర్లకు అధికారులు గులాబీ పూలు అందించి స్వాగతం పలికారు. వాటిని దాటగానే లోపల అంతా పచ్చటి ఎర్రని (గ్రీన్, రెడ్ మ్యట్)ను ఏర్పాటు చేశారు. రంగు రంగుల టెంట్లను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడాల్సిన అవసరం లేకుండా కుర్చీలను ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా వీల్‌ఛైర్‌లను ఏర్పాటు చేశారు. వారిని తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపులకు పూలతో అలంకరించారు. అదేవిధంగా వివిధ రకాల పూలతో పోలింగ్ బూత్‌లకు అలంకరణ చేశారు. ఓటర్లకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా త్రాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. మొత్తంగా వినూత్న రీతిలో ఓటర్లు ఓ శుభకార్యానికి వచ్చినట్లు ఉందని ఓటర్లు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

దుగ్గొండిలో ప్రశాంతంగా పోలింగ్

దుగ్గొండి, నవంబర్ 30, ప్రభాతవార్త

దుగ్గొండి మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 49 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా గురువారం జరిగింది. మండలంలోని చలపర్తి గ్రామంలో మాడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా విశేష ఆధరణ లభించింది. మండలంలో ఉదయం నుండి పోలింగ్ కేంద్రాల్లో మందకోడిగా సాగింది. మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ పుంజుకొని మహిళా ఓటర్లు భారులు తీరి నిలబడ్డారు. సాయంత్రం వరకు అదవిరంగాపురం గ్రామంలో పోలింగ్ బూత్‌లో 160 ఓట్లు ఉండగా సాయంత్రం ఐదు గంటల వరకు భారులు తీరి ఉన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. నారాయణతండా గ్రామపంచాయతీ పరిధిలో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలను చెదరకొట్టారు. కేశవపురంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత కాంగ్రెస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి తన స్వగ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని తొగర్రాయి గ్రామంలో ఎన్నికల

పోలింగ్ కేంద్రాన్ని పోలీస్ కమీషనర్ అంబర్‌కిషోర్‌ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా చూసుకోవాలని పోలీసులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట సిఐ కిషన్, ఎస్ఐ పరమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులు వృద్దులకు మెరుగైన సౌకర్యాలు

చెన్నారావుపేట, నవంబర్ 30, ప్రభాతవార్త

అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, వృద్దులకు మెరుగైన ఉచిత సేవలు అందించామని ఏపీఎం ఈశ్వర్ అన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను వీల్ చైర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందుకు స్థానిక వీవోఏలు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అంగన్‌వాడీ టీచర్లు తమ సేవలను అందించారు. ఈ మేరకు ఏపీఎం వారి యొక్క పనితీరును పరిశీలించేందుకు పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 25వీల్ చైర్లు ఉదయం నుండి సాయంత్రం వరకు ఎంతో సామర్థ్యవంతంగా పనిచేయించడం జరిగిందన్నారు. ఇందుకు వీవోఏలు ఇతర సిబ్బంది తగిన సేవలు అందించారన్నారు. అలాగే మరికొంత మంది వృద్దులను ఆటోలలో తరలించడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో తహసీల్దార్ ఫణికుమార్, ఎస్ఐ మహేందర్‌లు పరిశీలించారు.

కొత్త కొత్తగా.. ఉత్సాహంగా..

తొలిసారి ఓటు

- ప్రజాస్వామ్యమా వర్ధిల్లు

(పరకాల - ప్రభాతవార్త)

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక వజ్రా యుధం. పోటీలో ఎంతమంది అభ్యర్థు లున్నా.. ఆయా అభ్యర్థుల సమర్థత,ఆయా పార్టీల సిద్ధాంతాలు,ఎన్నికల ప్రణాళికలు ఓటర్లను ప్రభావితం చేస్తాయి.తమ భవిష్య త్తును తీర్చిదిద్దే నాయకుడిని ఎన్నుకోవడానికి ఓత్త ఓటర్లు నడం కట్టారు.తమకు ఇష్టమైన అభ్యర్థికి ఓటు వేసిన అనంతరం ప్రజాస్వామ్య అనుభూతిని వెల్లడించారు.గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యువత ఉత్సాహం చూపారు.తొలిసారి ఓటు వేస్తున్నామన్న ఆనందంతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.క్యూ లైన్లలో నిల్చొని ఓటు వేశారు.సమర్థవంతమైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో తమవంతు పాత్రను పోషించామని చెప్పారు.చూపుడు వేలికి వేసిన సిరా చుక్కను చూపుతూ హ్యాపీగా సెల్ఫీలు దిగారు.

ఆనందంగా ఉంది..

-నేరెళ్ల రక్షిత,పరకాల

18 సంవత్సరాల వయస్సు పూర్తి కాగానే ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నాను.ఇటీవలే ఓటరు జాబితాలో నా పేరు వచ్చింది.అసెంబ్లీ ఎన్నికల్లో నా మొదటి ఓటును వినియోగించుకోవడం ఆనందంగా ఉంది.ఇది జీవితంలో మర్చిపోలేనిది.

ఓటు ఒక వజ్రాయుధం..

-నేరెళ్ల రమ్య శ్రీ,పరకాల

జాతి భవిష్యత్తును తీర్చిదిద్దే అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఓటు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది.ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటరు పాత్ర కీలకమని తెలుసుకున్నాను.

బాధ్యతను గుర్తు చేసిన ఓటు..

-రణధీర్ కుమార్,పరకాల

ఈ అసెంబ్లీ ఎన్నికలు ప్రజల హక్కుతో పాటు బాధ్యతలను కూడా నాకు గుర్తు చేశాయి.నాకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసుకోగలిగాను.భారత ప్రజాస్వామ్యమా వర్ధిల్లుమా.

స్వేచ్ఛగా ఓటు వేశాను..

-రచన,పరకాల

మహిళా సాధికారతకు అందరితో సమానంగా ఓటు హక్కు కలిగి ఉండడం నిదర్శనం.వివేచనతో.విచక్షణతో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నాను.

ఓటు హక్కు వినియోగించుకున్న గూడూరు అభ్యర్థులు

గూడూరు, నవంబర్ 30, ప్రభాతవార్త

గూడూరు మండలం నుండి మానుకోట అసెంబ్లీ నియోజవర్గ ఎమ్మెల్యే ఎన్నికల బరిలో నిలిచిన ఇద్దరు అభ్యర్థులు గురువారం తమ స్వగ్రామాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిజెపి నుండి బరిలో ఉన్న మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన జాటోతు హుసేన్‌నాయక్ అదే గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న గూడూరుకు చెందిన స్థానిక సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ పట్టణంలోని చంద్రుగూడెం ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు

ప్రభాతవార్త- బాలసముద్రం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోచమ్మకుంట పోలింగ్ కేంద్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి తన సతీమణి నాయిని నీలిమా రెడ్డితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అది మన అందరి బాధ్యత అని, అలస్యంచేయకుండా ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని అన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న పశ్చిమ అభ్యర్థి రావుపద్మ..

హనుమకొండ హంటర్ రోడ్‌లోని శ్రీవికాస్ జూనియర్ కాలేజీలోని 112వ పోలింగ్ బూత్‌లో బిజెపి పశ్చిమ అభ్యర్థి రావుపద్మ మొట్టమొదటి ఓటు వేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో చాలా ప్రాముఖ్యమైనదని దీనిని ప్రతి ఒక్క ఓటరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మద్దికాయల ఓంకార్ చెల్లెలు..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నర్సంపేట మాజీ శాసన సభ్యులు దివంగత మద్దికాయల ఓంకార్ చెల్లెలు మొగిళి నిర్మల తన

ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటరు తమ ఓటు హక్కుగా తప్పకుండా వినియోగించుకోవాలన్నారు.

భూపాలపల్లిలో 76.1 శాతం పోలింగ్

భూపాలపల్లి, నవంబర్30, ప్రభాతవార్త
భూపాలపల్లి నియోజక వర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పోలీస్ బలగాలు, భద్రతా సిబ్బంది సహకారంతో ప్రశాంతంగా ముగిసింది. భూపాలపల్లి నియోజక వర్గంలో 76.1 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. భూపాలపల్లి నియోజక వర్గంలో గల 317 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా భూపాలపల్లి నియోజక వర్గంను గుర్తించిన ఎన్నికల సంఘం ఎన్నికల పోలింగ్ విషయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఇప్పటికే ప్రకటించటం జరిగింది. కాగా సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చున్న వారికి అధికారులు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్‌కు అవకాశం కల్పించినప్పటికి 76.1 శాతం పోలింగ్ నమోదు కావటం పట్ల ఎన్నికల అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి నియోజక వర్గంలో ఎన్నికల అధికారులు 317 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయగా 273633 మంది ఓటర్లు గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 76.1 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భూపాలపల్లి మండలంలో 78 పోలింగ్ స్టేషన్‌లలో 77077, రేగొండ మండలంలో 38 పోలింగ్ స్టేషన్‌లలో 33217, గణపురం మండలంలో 36 కేంద్రాల్లో 31909, చిట్యాల మండలంలో 38 కేంద్రాల్లో 30329, మొగుళ్లపల్లి మండలంలో 37 కేంద్రాల్లో 29854, టేకుమట్ల మండలంలో 28 కేంద్రాల్లో 21715, గోరికొత్తపల్లి మండలంలో 20 కేంద్రాల్లో 16073, శాయంపేట మండలంలో 42 కేంద్రాల్లో 33459 మంది ఓటర్లు ఉండగా 76.1 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవటం జరిగింది.

జిల్లా కేంద్రంకు తరలించిన ఈవీఎంలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ అంబేద్కర్ స్టేడియంకు గురువారం సాయంత్రం భూపాలపల్లి నియోజక వర్గంకు చెందిన 317 పోలింగ్ కేంద్రాలకు సంబందించిన ఈవీఎంలను తరలించారు. పోలీసు, సాయుధ బలగాల సహకారంతో పోలింగ్ సిబ్బంది ఈవీఎం యంత్రాలను ఏర్పాటు చేసిన వాహనాలలో పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ కౌంటర్‌లకు తరలించారు. ఎన్నికల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, ఆయా శిభిరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవితో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆశ, అంగన్‌వాడీ, మున్సిపాలిటి ఉద్యోగులు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు తమ సేవలను అందించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులు ఓటు హక్కును వినియోగించుకోవటం కోసం ప్రత్యేకంగా వీల్ చైర్‌లను ఏర్పాటు చేశారు. ఓటు వేసుందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు అధిక సంఖ్యలో తరలిరావటంతో క్యూ పద్దతి పాటించటంలో కొంత ఇబ్బంది కలిగింది. పోలీసుల సంఖ్య తక్కువగా ఉండటంతో కొంత సమస్య తలెత్తింది. ఈ సారి కొత్తగా ఓటు వేసేందుకు అవకాశం వచ్చిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును మొదటిసారి వినియోగించుకోవటం కోసం పోలింగ్ స్టేషన్‌లకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవటం జరిగింది.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గల పోలింగ్ బూత్‌లో గురువారం ఎంఎల్ఎ, బిఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి, గణపురం మండలం బుద్దారం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు దంపతులు, మాజీ స్పీకర్, ఎంఎల్‌సి సిరికొండ మదుసూదనాచారి పట్టణంలోని పోలింగ్ బూత్‌లో, వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలోని పోలింగ్ బూత్‌లో బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి, భూపాలపల్లి పట్టణంలోని పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఒకరికి బదులు మరోకరు ఓటింగ్

భూపాలపల్లి మున్సిపాలిటి పరిధిలోని జంగేడు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో బూత్ నెంబర్ 55లో గురువారం జరిగిన పోలింగ్‌లో ఒకరికి బదులు మరోకరు ఓటు వేసినట్లు సదరు ఓటరు పోలింగ్ అధికారుల దృష్టికి తీసుకుపోయాడు. బూత్ నెంబర్ 55లో కందూనూరి శ్రీనివాస్ అనే ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాగా అతని ఓటు వేయబడిందని అధికారులు తెలపటంతో ఆందోళన చెందాడు. పోల్ చిట్టీతో పాటు ఓటర్ ఐడీ కార్డు చూపినప్పటికి అతనికి ఓటు వేసేందుకు అధికారులు అంగీకారం తెలిపలేదు. ఈ విషయంలో భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి వచ్చి పోలింగ్ అధికారులతో మాట్లాడినప్పటికి ఫలితం లేకుండా పోయింది. వాస్తవానికి అదే పేరు కలిగిన వ్యక్తికి మరో బూత్‌లో ఓటు ఉందని తెలుస్తున్నది.

డిసెంబర్ 4న సింగరేణి ఎన్నికలపై సమావేశం

భూపాలపల్లి, నవంబర్30, ప్రభాతవార్త
సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబందించి కార్మిక సంఘాలతో చర్చించటం కోసం డిసెంబర్ 4న హైదరాబాద్ డిప్యూటి సీఎల్సీ సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని చీఫ్ లేబర్ కమీషనర్ కార్యాలయంలో సింగరేణి యాజమాన్యంతో పాటు 13 కార్మిక సంఘాలతో సమావేశంకు హాజరు కావాలని కార్మిక సంఘాలకు ఆహ్వానం పంపారు. డిసెంబర్ 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్న క్రమంలో ఏర్పాట్లు చేసేందుకు ఎన్నికల అధికారి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు.
దీంతో డిసెంబర్ 27న సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించుటకు మార్గం సుగమం అయింది.

మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత

నల్లబెల్లి, నవంబర్ 30, ప్రభాతవార్త
అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి సారి మండలంలోని అన్ని గ్రామాల్లోని యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా యువ ఓటర్లు ఓటింగ్‌కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని ఓటు హక్కును వినియోగించుకుందామని వారు తెలియజేశారు. మండల కేంద్రానికి చెందిన అక్కాతమ్ముళ్లు అయినా హారిక, చిరంజీవి తమ ఓటు హక్కును వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. మొత్తానికి మండలంలో ఎన్నడు లేని విధంగా నూతన ఓటర్లతో పాటు యువత తమ ఓటు హక్కును ఎక్కువ శాతం వినియోగించుకుందామని తెలిపారు.

ఆర్టీసి ఉద్యోగుల సేవలు అభినందనీయం

ప్రభాతవార్త- బాలసముద్రం: ఆర్టీసి ఉద్యోగుల సేవలు అభినందనీయమని వరంగల్ డిపో మేనేజర్ గుండా సురేష్ అన్నారు. గురువారం వరంగల్ టు డిపోలో పదవీ విరమణ చేయున్న ఏడీసీలు, వీఆర్‌రెడ్డి, ఎమ్మెస్ఎస్‌రావు, కండక్టర్ పీకేరావు, పదవి విరమణ చేశారు. ఇట్టి కార్యక్రమానికి గౌరవ డిపో మేనేజర్ గుండా సురేష్, ఆఫీస్ సూపరెండెంట్ సురేష్, అసిస్టెంట్ మేనేజర్ జ్యోస్న, కార్మికులు, ఆఫీసు సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమ చేయుచున్న వారికి డిపో మేనేజర్ శాలువాలతో సత్కరించి మెమెంటోలను బహుకరించారు.

నర్సంపేటలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

-83 శాతం పోలింగ్ నమోదు

నర్సంపేట, నవంబర్ 30, ప్రభాతవార్త
అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. డివిజన్‌లోని పలు గ్రామాలతో పాటు నర్సంపేట పట్టణంలో కూడా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దుగ్గొండి మండలం నారాయణతండా గ్రామంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఉదయం 7గంటలకు జరిగిన పోలింగ్ మందకోడిగా కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం డివిజన్ వ్యాప్తంగా 83 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. ప్రధానంగా కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల మధ్య పోటీ నెలకొనడంతో ఆ పార్టీల నాయకులు పోటీపడి ఓట్లు వేయించుకున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి తన స్వగ్రామమైన చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లో ఓటు హక్కును వినియోగించుకోగా బిఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి నల్లబెల్లిలో ఓటు వేశారు. అదేవిధంగా బహుజన సమాజ్‌పార్టీ బిఎస్‌పి అభ్యర్థి గుండాల మధన్‌కుమార్ నల్లబెల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒకవైపు బిజెపి అభ్యర్థి కంబంపాటి పుల్లారావు, ఎంసిపిఐయు అభ్యర్థి పెద్దారపు రమేష్‌లు నర్సంపేటలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. యువకులు, వృద్ధులు ఓటు హక్కును సజావుగా వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ఖానాపురం, నవంబర్ 30, ప్రభాతవార్త
మండలంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలలో పోలీసుల నడుమ భారీ బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎలక్షన్ అధికారులు ఎన్నికలను నిర్వహించారు. ముఖ్యంగా మండలంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే గట్టి పోటీ నెలకొంది. మండలంలో బుధరావుపేట, అశోక్‌నగర్, ఖానాపురం మండల కేంద్రాల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవడానికి ప్రజలు ఉదయం 7గంటల నుండే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు నత్తనడకన నడవడంతో బూత్‌ల వద్ద ఓటర్లు భారులు తీరారు. చిన్న చిన్న సంఘటనలు తప్పా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి.

తరిగొప్పులలో 85.5శాతం పోలింగ్ నమోదు

తరిగొప్పుల, నవంబరు 30 ప్రభాతవార్త : తరిగొప్పుల మండలకేంద్రంలోని అన్ని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. అధికసంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటుహక్కు వచ్చిన యువతీ యువకులు ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపించారు. గ్రామాల వారీగా తరిగొప్పుల మండలంలో మొత్తం 4,117ఓటర్లు ఉండగా 3,521మంది ఓటుహక్కు వినియోగించుకోగా 85.5శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గ్రామాల వారిగా ఓటర్ల పోలింగ్ వివరాలు ఈవిధంగా ఉన్నాయి... అంకుషాపురంలో 1365ఓటర్లకు 1178మంది ఓటును వినియోగించుకోగా 86.3శాతం నమోదు అయ్యింది. అక్కరాజుపల్లిలో 1016 మంది ఓటర్లకు 936మంది ఓటు వినియోగించుకోగా 92శాతం నమోదు, అబ్దుల్‌నాగారంలో 1142ఓటర్లకు, 1051మంది ఓటువేయగా 92శాతం నమోదు, మరియాపురంలో 359 మంది ఓటర్లకు 300ఓటు వినియోగించుకోగా 83.56శాతం, కొత్తతండాలో 319మంది ఓటర్లకు గాను 303ఓట్లు పోల్‌కాగా 95శాతం నమోదు, వాచ్యతండాలో 567మంది ఓటర్లకు 522మంది ఓటువేయగా 92శాతం, బొంతగట్టునాగారంలో 791మంది ఓటర్లకు 751ఓటు వేయగా 95శాతం, బోజ్యాతండాలో 571ఓటర్లకు 544ఓటువేయగా 96శాతం నమోదు అయ్యింది. సోలిపురంలో 1265మంది ఓటర్లకు గాను 1030మంది ఓటువేయగా 81శాతం నమోదు, మాన్సింగ్‌తండాలో 407మంది ఓటర్లకు 364ఓటు వేయగా 89శాతం నమోదు, పోతారంలో 1030మంది ఓటర్లకు గాను 947ఓటు వేయగా 92శాతం, బొత్తలపర్రెలో 1358మంది ఓటర్లకు గాను 1221ఓటు వేయగా 89.9శాతం నమోదు, నర్సాపూర్‌లో 1047మంది ఓటర్లకు 960మంది ఓటువేయగా 91.6శాతంగా పోలింగ్ నమోదు అయినట్లు సెక్టోరియల్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలియచేశారు.

మూడోసారి సీఎంగా కేసీఆర్‌కు పట్టం కట్టనున్న తెలంగాణ ప్రజలు

-మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు పొన్నాల లక్ష్మయ్య

రఘునాథపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్‌కు యావత్తు తెలంగాణ ప్రజలు మూడోసారి పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. గురువారం జరిగిన సాధారణ ఎన్నికల్లో భాగంగా పొన్నాల లక్ష్మయ్య మండలంలోని ఖిలాషాపురం స్వగ్రామానికి వచ్చి సతీసమేతంగా తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం రిటైర్డుఉపాధ్యాయుడు దుబ్బాక ఉత్తరయ్య అనారోగ్యంతో మరణించగా ఆయన పార్థీవదేహానికి పొన్నాల పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రోళ్లకుమార్ గౌడ్, వారాల రమేష్, మల్కాపురం లక్ష్మయ్య, జిట్టె వీరస్వామి, కట్లసదానందం, కావటి రాజయ్య, ముప్పిడి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికలు

జఫర్‌గడ్, నవంబరు 30 ప్రభాతవార్త : జఫర్‌గడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు, అధికారులు, పోలీసులు రాజకీయ పార్టీల నాయకులు ఊపిరిపీల్చుకున్నారు. ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైన ఎన్నికలు పలు గ్రామాల్లో ఐదుగంటల వరకే ముగిసాయి. కాగా, ఓబులాపూర్ ఉప్పుగల్, తీగారం గ్రామాల్లో ఓటర్లు అధికసంఖ్యలో ఉండడంతో ఐదుగంటల లోపు గేటులోపలికి వచ్చిన వారికి ఓటింగ్ అవకాశాన్ని అధికారులు కల్పించారు. అదేవిధంగా సాగరం గ్రామంలో గంటసేపు ఈవీఎం మొరాయించడంతో మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో 12గంటల వరకు ఓటర్లు తక్కువసంఖ్యలో హాజరయ్యారు. నూతనంగా ఓటుహక్కు పొందిన వారు సంతోషంతో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వికలాంగులకు వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల వరకు ఆటోలను ఏర్పాటు చేశారు. బీజేపీ అభ్యర్థి గుండె విజయరామారావు మండలంలోని సూరారం, తీగారం గ్రామంలో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తును పోలీసులు ఏర్పాటుచేశారు. స్థానిక ఎస్ఐ మహేందర్ అన్ని గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

పోలింగ్‌కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించిన ఎన్నికల అబ్జర్వర్

బచ్చన్నపేట, నవంబరు 30 ప్రభాతవార్త : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం బచ్చన్నపేట మండలకేంద్రం లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని సెంట్రల్ ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ పి.రమణ సరస్వతి సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట తహసీల్దార్ విశాలాక్షి పాల్గొన్నారు.

- ఓటుహక్కు వినియోగించుకున్న బోడకుంటి..:

బచ్చన్నపేటలో తన ఓటుహక్కును మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడకుంటి వెంకటేశ్వర్లు వినియోగించుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ జడ్పీచైర్మన్ ధన్వంతి లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల, నవంబరు 30 ప్రభాతవార్త : దేవరుప్పుల మండలం లకావత్ తండా గ్రామానికి చెందిన మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ దంపతులు దేవరుప్పుల మండలంలోని తన స్వగ్రామం మాదాపురం గ్రామ ఉన్నత పాఠశాల పోలింగ్‌కేంద్రంలో కుటుంబ సమేతంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో సోదాలు నిర్వహించిన ఫ్లయింగ్‌స్క్వాడ్

పాలకుర్తి, నవంబరు 30 ప్రభాతవార్త : పాలకుర్తి మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డబ్బు ఉందనే సమాచారంతో పాలకుర్తి పోలీసులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ పోలీసుల ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించినట్లు సమాచారం.

పోలింగ్‌బూత్‌ను పరిశీలించిన ఎర్రబెల్లి

పాలకుర్తి, నవంబరు 30 ప్రభాతవార్త : పాలకుర్తి మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించి మంత్రి.

ఓటుహక్కు వినియోగించుకున్న జిల్లా ఎన్నికల అధికారి

జనగామ టౌన్, నవంబరు 30 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు-2023లో జనగామ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య తన ఓటును వినియోగించుకున్నారు. గురువారం జనగామ పట్టణంలోని ప్రెస్టన్ కాలేజీలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 272లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య దంపతులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. అదేవిధంగా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సతీసమేతంగా తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

రఘునాథపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త : రఘునాథపల్లి మండలంలో గురువారం జరిగిన సాధారణ శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 36గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 43,338మంది ఓటర్ల కాగా, పురుషులు 18,846మంది ఉండగా, మహిళలు 18,515మంది ఓటర్లు ఉన్నారు. అందులో 37,361మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోగా 86.21శాతం నమోదైనట్లు ఏఈఆర్వో తహసీల్దార్ యుగేంధర్ తెలిపారు. ఐతే కంచనపల్లి గ్రామంలో ఈవీఎం సుమారు స్వల్పంగా మొరాయించడంతో అంతరాయం కలిగింది. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మొత్తం మీద సాధారణ శాసనసభ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిసాయి.

కేయూ ఇయర్‌వైజ్ డిగ్రీ పరీక్షల ఫలితాల విడుదల

ఎడ్యుకేషన్ కేయూ, నవంబరు 30 ప్రభాతవార్త : అక్టోబరు/నవంబరు నెలల్లో నిర్వహించిన డిగ్రీ మొదటి, రెండవ, మూడవ (ఇయర్ వైజ్) సంవత్సర ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాసరావు గురువారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ విభాగంలో 81శాతం, బీబీఎంలో 89శాతం, బీకాంలో 64శాతం, బీజడ్‌సీలో 64శాతం, ఎంపీసీలో 72శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ ఎం.తిరుమలదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడటం సరికాదు

నర్సింహులపేట, డిసెంబర్ 30, ప్రభాతవార్త అధికార పార్టీకి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలపై దాడులు చేయడం సరికాదని,ఇది హేయమైన చర్య అని డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రేస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రామచంద్రునాయక్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ....అధికార పార్టీకి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు తన స్వంత వ్యక్తిగత డ్రైవర్‌పై మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో దాడులకు పాల్పడటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను ప్రోత్సహిస్తున్న రెడ్యానాయక్ ఇప్పటికైనా నీ పద్దతి మార్చుకోవాలని హెచ్చరించారు.

అయ్యప్ప దేవాలయంలో మహాన్నదానం

నర్సంపేట, నవంబర్ 30, ప్రభాతవార్త నర్సంపేట పట్టణంలోని శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం ప్రాంగణంలో ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో మండలపూజా మహోత్సవం 14 రోజు కొనసాగింది. ఆలయ గురుస్వామి గండె సంజీవరావు సుజాత, డాక్టర్ గండె వెంకటేశ్వర్లు కావ్య దంపతులు కుమార్తె 21వ రోజు సందర్భంగా దాతలుగా చైర్మన్ చేతుల మీదుగా నూతన వస్త్రాలు ధరించి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, జరువగా నైవేద్యం సమర్పించి మాలదర స్వాములకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా ఆలయ సేవలో ఉన్నత స్థాయిలో గురుస్వామిగా కొనసాగుతూ ఈ రోజు అన్నదానంలో పాల్గొని భక్తులకు నైవేద్యం సమర్పించినందుకు గురుస్వాములను అభినందించారు. ప్రతి భక్తుడు ఆలయ అభివృద్ధిలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా, మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, శ్రీరాముల శంకరయ్య, శింగికొండ వేణుగోపాల్‌గుప్తా, బండారుపల్లి చెందారావు, శ్రీరాముల కార్తిక్, భూపతి రాజశేఖర్, భరత్, ఆలయ అర్చకులు కార్యవర్గ సిబ్బంది గుమస్తాలు, వంటశాల బృందం రామస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

పూర్తిగా మహిళలచే నిర్వహించబడి ప్రత్యేకంగా కొత్త వాడలోని గోల్డెన్ ఓక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, క లెక్టర్ ప్రావీణ్య గురువారం సంద ర్శించారు. పోలింగ్ కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించి చేపట్టిన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వినూత్నంగా మహిళా ఓటర్లను ఆకట్టు కునేలా మహిళలచే నిర్వహించబడే విధంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 5 ప్రాంతా ల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, ఏర్పాటులో భాగంగా పోలింగ్ కేంద్రానికి ఓటర్లకు స్వాగతం పలికేలా ఆహ్వాన బ్యానర్ ఎంట్రన్స్ నుండి గ్రీన్ కార్పెట్ ఏర్పాటుతో పాటు బెలూన్లతో అలంకరణ, అన్ని టేబుల్స్ ను వస్త్రంతో కప్పి ఉంచడం, ఓటు వేయడానికి మాతృ మూర్తులతో వచ్చే పిల్లలు ఆడుకోవడానికి ఆట బొమ్మల ఏర్పాటు, పోలింగ్ కేంద్ర ఆవరణలో రంగ వల్లులు, సెల్ఫీ పాయింట్, వాష్‌రూంల ఏర్పాటు, సహాయం అందించ డానికి మహిళా సహా యకుల ఏర్పాటు, సూచికలు బాగున్నాయని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఇక్బాల్ పాల్గొన్నారు.

వరంగల్‌లో తూర్పులో ఓటుహక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

మొదటిగా ఓటుహక్కు వినియోగించుకున్న యువత తూర్పులో చివరి సమయంలో అత్యధికంగా ఓటింగ్

పోచమ్మ మైదాన్, నవంబర్ 30, (ప్రభాతవార్త)

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సాయంత్రం ఐదుగంటల వరకు 64 శాతం ఓటింగ్ నమోదు కాగా సాయంత్రం నాలుగు తర్వాత ఒక్క సారిగా పెరుకవాడ, గాంధీనగర్, శివ నగర్, లక్ష్మీపురం, గిర్మాజీపేట, తూర్పు మధ్య కోట ప్రాంతాల్లో ఒక్కసారిగా అత్యధికంగా ఓటర్లు పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుక్ను వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ప్రావీణ్య

105 వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని హన్మకొండ రాజ్‌పుత్ వాడలోని తేజస్ జూనియర్ కాలేజీ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ పి.ప్రావీణ్య ఓటుహక్కును వినియో గించుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న బల్దియా కమిషనర్

గ్రేటర్ మహా నగరంలోని హన్మకొండ కమిషనర్ క్యాంపు కార్యాయ సమీపంలో గల ప్రాంతీయ పర్యవేక్షక ఇంజ నీర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వరంగల్ (తూర్పు) రిట ర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఓటుహక్కును వినియో గించు కున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న తూర్పు బిఆర్ఎస్ అభ్యర్థి నరేందర్

వరంగల్ తూర్పు నియోజ కవర్గం పెరక వాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి వరంగల్ తూర్పు బిఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్ ఓటు హక్కును వినియో గించుకున్నారు.

ఓటుహక్కును వినియోగించుకున్న బిజెపి అభ్యర్థి ప్రదీప్‌రావు

వరంగల్ తూర్పు నియోజక వర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన ఎర్రబెల్లి ప్రదీప్‌రావు 19వ డివిజన్ ఓసిటి ప్రతాప్ నగరలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో తమ ఓటుహక్కును విని యోగించు కున్నారు.

మొదటిసారి ఓటుహక్కును వినియో గించుకున్న యువత

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజక వర్గంలో అత్యధికంగా 18 ఏండ్లు పైబడిన యువతీ యువ కులు మొదటి సారిగా ఎంతో ఉత్సా హంగా ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కును వినియో గించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

నల్లబెల్లి, నవంబర్ 30, (ప్రభాతవార్త)

గురువారం నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో ఉన్న నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డితో పాటు బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గుండాల మదన్ కుమార్ తమ ఓటు హక్కును వినియో గించు కున్నారు. మండల కేంద్రంలోని 74వ పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే పెద్ది ఓటు హక్కును వినియో గించుకోగా, 72వ బూత్‌లో మదన్ కుమార్ ఓటు హక్కును వినియో గించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థులు మాట్లాడుతూ తమ విజయంపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేశారు. మొత్తానికి మండల ంలోని గతంలో కంటే ఎక్కువ శాతం పోలింగ్ పెరగడంతో అధికారులు, మండల ప్రజలు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం కొన్ని బూత్‌లలో మందకోడిగా సాగిన పోలింగ్ సరళి మధ్యా హ్నం 12 గంటల తర్వాత ఒక్కసారిగా ఊపం దుకుంది. సాయం త్రం పోలింగ్ సమ యం పూర్తయి నప్పటికి పోలింగ్ బూత్‌ల ప్రాంగణంలో ఉన్న ఓటర్లు బారులు తీరి కనిపించారు. దీంతో పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ప్రాంగణంలో ఉన్న వ్యక్తులకు మాత్రమే ఓటు హక్కు వినియో గించుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు. నల్లబెల్లి మండలం నుండి పోటీ చేసే పెద్ది సుదర్శన్‌రెడ్డి, గుండాల మదన్‌కుమార్‌లు వీరిద్దరు, క్యూలైన్లో ఉండి ఓటు హక్కును వినియో గించు కున్నారు. మండలంలోని ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా ఎన్నికల అధి కారులు, పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. మండలం లోని రెండు మూడు గ్రామాలలో చెదురు ముదురు సంఘటనలు చోటు చేసు కోవడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని వారించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి ఆయా పోలింగ్ బూత్‌లను పరిశీలనలో భాగంగా మండలం లోని పలు గ్రామాలలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

వరంగల్ తూర్పులో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీలు, మేయర్, మాజీ మేయర్

పోచమ్మ మైదాన్, నవంబర్ 30, (ప్రభాతవార్త)

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఆయా డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో శాసన మండలి వైస్ ఛైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ గుండా ప్రకాశ్, పలువురు ప్రజాప్రతి నిధులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కును వినియో గించుకన్నారు.

సాధారణ వ్యక్తిలా ఓటు వినియోగించుకున్న మంత్రి

కురవి,నవంబర్30,(ప్రభాతవార్త)

కురవి మండలంలోని పెద్దతండాలో మహిళలతో కలిసి రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రిసత్యవతిరాథోడ్ క్యూలైన్‌లో నిల్చోని ఓటును విని యోగించు కున్నారు. సాధారణ మహిళలాగాఓటు వినియోగించు కోవడంతో ఓటర్లు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రజలకు రాజ్యాంగంకల్పించిన ఓటు హక్కును వృధాచేయరాదని తప్ప నిసరిగా ఉపయోగించుకోవాలన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

మహబూబాబాద్,నవంబర్30,(ప్రభాతవార్త)

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నిర్వ హించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందనిజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. పోలింగ్‌లో డోర్నకల్ నియోజక వర్గంలో 79.32 శాతం, మహబూ బాబాద్ నియోజక వర్గంలో 75.93శాతం నమోదైందని మొత్తంగా 77.50శాతం నమోదైనట్లు తెలిపారు. ఎటువంటి అసాంఘిక సంఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

వాజేడు మండలంలో 88 శాతం నమోదు

వాజేడు, నవంబర్ 30, (ప్రభాతవార్త):

తెలంగాణ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వాజేడు మండలంలోగురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఏర్పాటు చేసిన 27 పోలింగ్ బూత్‌లలో 88 శాతం పోలింగ్ నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌లు భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది. మండల వ్యాప్తంగా గెలుపు పై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.బీఆర్ఎస్ పార్టీ నుండి డాక్టర్ తెల్లం వెంకట్రావు బరిలో ఉండగా, కాంగ్రెస్‌పార్టీ నుండి పొదెం వీరయ్యలు పోటీపడుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన స్థానిక ఎమ్మెల్యే ఎన్నికలు

మరిపెడ,నవంబర్30,(ప్రభాతవార్త)

డోర్నకల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని డోర్నకల్ రిటర్నింగ్ అధికారి నర్సింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోమొత్తం ఓటర్లు 219264మంది ఉండగా 256బూతులు ఏర్పాటు చేసి 32రూట్లల్లో 3వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహించామన్నారు. చెదురుమదురు సంఘటనల మినహా ఎన్నికలుసజావుగా ముగిశాయని తెలిపారు. 5గంటల సమయం ముగిసేవరకు 79.32శాతం ఓట్లుపోలైనట్లు తెలిపారు.